# ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఘనంగా గణతంత్ర్య దినోత్సవ వేడుకలు

తేది: 26.01.2017

68వ గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ద్రావిడ విశ్వవిద్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్శిటీ ప్రాంగణంలోని జాతిపిత గాంధీజీ విగ్రహానికి, శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి, సరస్వతీ దేవి విగ్రహానికి, ఎన్‌టిఆర్ విగ్రహాలకు వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ పూలమాలలు వేశారు. ఉదయం 7.45 గంటలకు ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వర్శిటీ ఓపెన్ ఎయిర్ స్టేడియంలో గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్య ఇ.సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగా సమాజ హితానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ చదువుకు ప్రాధాన్యమిచ్చి నిరక్షరాస్యతను పారద్రోలి, సమాజాన్ని అవినీతి రహితంగా చేయాలని కోరారు. మనలో ప్రతిఒక్కరూ చదువుకుని, మన వ్యవస్థపై అవగాహన కలిగి, వున్న దానితో సంతృప్తి చెందినప్పుడే మనంమంచి సమాజాన్ని నిర్మించవచ్చున్నారు. ఇప్పటికీ భారతదేశంలో 30 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన వున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్య మన సమాజాన్ని పట్టి పీడుస్తున్న ప్రధాన సమస్య అని తెలిపారు. అవినీతి ఎక్కువగా వున్న 106 దేశాలలో భారతదేశం 55వ స్థానంలో వున్నందుకు మనమందరము ఆలోచించి మన దేశాన్ని అవినీతి రహిత దేశంగా ప్రగతి పథంలో నడపాలని కోరారు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న ఆర్థిక వ్యవస్థలో ధరల పెరుగుదల అనివార్యంగా మారిందన్నారు. వీటన్నింటినీ మన విద్యార్థులు, సమాజం సమిష్టి కృషితో పని చేసి అధిగమించాలన్నారు. అనంతరం వర్శిటీ విద్యార్థినీ విద్యార్థులచే తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలతో పాటు హిందీలో దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రెక్టార్ ఆచార్య జి.బాలసుబ్రమణియన్, రిజిస్ట్రార్ ఆచార్య బి.తిరుపతిరావు, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.పెంచలయ్య, డీన్లు, విభాగాధిపతులు, వర్శిటీ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.







